# యేసుని మరణ, పునరుత్థాన కాలములోని యెరూషలేము

"సమస్త మార్గాలు రోముకు నడిపిస్తాయనే" సామెత ఉండేది. రోమా సామ్రాజ్యానికి రోము కేంద్రస్థానమై యుండేది – కాని క్రీస్తు మరణ, పునరుత్థాన దినాల్లో యూదుల దృష్టి మరో చోటికి మల్చబడింది. ఆ కాలమున "ఆకాశము క్రింద నుండు ప్రతి జనములో నుండి వచ్చిన భక్తిగల యూదులు యెరూషలేములో కాపురముండిరి": పార్తీయులు మాదీయులు ఏలామీయులు, మెసొపొతమియ యూదయ కప్పదొకియ, పొంతు ఆసియ ఫ్రుగియ పంపులియ ఐగుప్తు అను దేశములయందలివారు, కురేనే దగ్గర లిబియ ప్రాంతములయందు కాపురమున్నవారు, రోమానుండి పరవాసులుగా వచ్చినవారు, యూదులు, యూదామత ప్రవిష్టులు, క్రేతీయులు అరబీయులు మొద లైనవారు (అపొ. 2:9–11). ఇలాటి అసంఖ్యాకులలో "ఆయనను సిలువేయమని" కేకలు వేసినవారు లేకపోలేదు!

ఆయన మరణ సమయంలో ఉన్న అనేకులు, యాభై దినాలకు వచ్చిన పెంతెకొస్తు దినాన కూడివచ్చిన జనులలో ఉన్నారు. పేతురు మిగిలిన అపొస్తలులతో కూడా లేచి నిలిచి ప్రసంగించిన తొలి సువార్త ప్రసంగంలో, "మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తు గాను నియమించె"నని ఆ యూదులు చెప్పబడ్డారు (అపొ. 2:36). "వారీమాటలు విని హృదయములో నొచ్చుకొని [పొడవబడినవారై] సహోదరులారా మేమేమి చేయవలెనని ..." అడిగారు (అపొ. 2:37). "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము మీలో ప్రతివాడును యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు పరిశుద్ధాత్మ అను వరము మీకు అనుగ్రహింపబడునని" చెప్పారు (అపొ. 2:38). అప్పుడు రమారమి మూడు వేల మందితో సంఘం స్థాపించబడింది.

ఆ దినమున, యెరూషలేము ఇతిహాసానికి కేంద్ర బిందువుగా ఉంది. సంఘం ఆరంభం కాగా, తాము దానిని విడిచి వెళ్లేలా బలవంత పెట్టబడేవరకు అనేకమంది నూతన క్రైస్తవులు యెరూషలేములోనే నిలిచిపోయారు. తరువాత, కొందరు తమతో సువార్త వాక్యమును తీసికొని ఆయా దేశాలకు తరలిపోయారు.